క్లుప్తంగా

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశ ర్మ, అర్చకులు స్వామి, అమ్మవారి దంపతులను విశేషంగా అలంకరించి ముందుగా స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్త పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం కన్నులపండువగా చేపట్టారు. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పలు ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

పశువులకు వైద్యసేవలు



ఎద్దుకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి భాస్కర్

పాములపాడు: అనారోగ్యంతో ఉన్న పశువులకు పశు వైద్యాధికారి భాస్కర్ చికిత్సలు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల రైతులకు ఎన్నో రకాలుగా ఉపయోగాలున్నాయన్నారు. 30 ఎద్దులు, 25 గేదెలు, 20 దూడలు, 2000 గొర్రెలు, కోళ్లకు నట్టల నివారణ మందులు వేశారు. ఆరింటికి చూడీ పరీక్షలు చేశారు. పిడుదుల నివారణకు మందులు పంపిణీ చేశారు. మినీ గోకులాలు, గడ్డి పెంపకం, ఇన్సూరెన్స్, 1962 పశు ఆరోగ్య సంచార వాహనం, వ్యాక్సినేషన్, టీఎంఆర్, దాణా గురించి అవగాహన కల్పించారు.

సర్వేలు త్వరగా పూర్తి చేయండి



ప్రత్యేక ఆధార్ క్యాంపును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వెలుగోడు: ప్రభుత్వం చేపట్టిన సర్వేలన్నీ త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం చెంచు కాలనీలో జరుగుతున్న ఆధారం నమోదు కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 6ఏళ్లలోపు పిల్లలకు నిర్వహించే ఆధార్ ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గండిపేట ప్రాథమిక పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. 1, 2, 5 సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

కౌలు రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

పాములపాడు: అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు చింతకుంట సుందర్రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకుడు సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం బానుముక్కల గ్రామానికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అప్పుల వారి ఒత్తిడులు అధికం కావడంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కేసీ కాల్వకు ఫిబ్రవరి వరకు మాత్రమే సాగునీటి విడుదల

పగిడ్యాల: కర్నూలు–కడప(కేసీ)కాల్వ కింద రబీలో సాగుచేసిన పంటలకు ఫిబ్రవరి నెలాఖరు వరకు మాత్రమే సాగునీటిని సరఫరా చేస్తామని కేసీ కాల్వ ఏఈ నరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి 1,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి టీఎంసీ నీటిని పది రోజులపాటు కేసీ కాల్వకు ఎత్తిపోసినట్లు తెలిపారు. రైతులు వరి పంటను సాగుచేసుకోకుండా ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేసుకోవాలని సూచించారు. సుంకేసుల డ్యాం నుంచి కాల్వకు సాగునీరు వస్తున్నందున ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ప్రస్తుతం కాల్వకు సాగునీటి సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు.

- నందికొట్కూరు నుంచి నంద్యాలకు వెళ్లే వీల్లేకుండా హైవే నిర్మాణం
- యూటర్న్ లేక పారుమంచాల మీదుగా నంద్యాలకు రాకపోకలు బంద్
- గ్రామాలకు, పొలాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్న రైతులు, ప్రయాణికులు
- తంగడంచ చెక్‌పోస్టు వద్ద యూటర్న్ ఏర్పాటుచేయాలని డిమాండ్



‘దారి’ద్య్రం

జూపాడుబంగ్లా: జాతీయరహదారి 340సీ రోడ్డు నిర్మాణం పనులను హైవే అధికారులు, కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిర్మిస్తుండటంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తంగడంచ చెక్‌పోస్టు వద్దనున్న పారుమంచాల రోడ్డు మీదుగా పారుమంచాల, తూడిచెర్ల, వాడాల, రేగడగూడూరు, వేల్పనూరు, వెలుగోడు, కరిమద్దెల గ్రామాల మీదుగా జిల్లా కేంద్రమైన నంద్యాలకు ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, రైతుల ట్రాక్టర్లు, ప్రైవేటు వాహనాలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలున్నాయి. ఎన్‌హెచ్340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా తంగడంచ చెక్‌పోస్టు వద్ద నందికొట్కూరు, కర్నూలు నుంచి వచ్చే వాహనాలు పారుమంచాల రోడ్డుకు వెళ్లకుండా డివైడర్ వేసి రోడ్డు నిర్మించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, రైతులు వాహనాల్లో పారుమంచాల రోడ్డుకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. విజయవాడ, గుంటూరు, శ్రీశైలం, ఆత్మకూరు వైపు నుంచి వచ్చే వాహనాలు నిలబడి ప్రయాణికులను దించే వెసులుబాటు లేకుండా చేశారు. హైవే అధికారులు చర్యలు తీసుకొని తంగడంచ చెక్‌పోస్టు మలుపు వద్ద యూటర్న్ ఏర్పాటుచేసి పారుమంచాల రోడ్డుకు ఆర్టీసీ బస్సులు, రైతుల ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, కార్లు వెళ్లేలా చేయాలని ప్రజలు, రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు. లేని ఎడల ఆందోళన చేపట్టి హైవే నిర్మాణం పనులను అడ్డుకొంటామని పేర్కొంటున్నారు.

తంగడంచ చెక్‌పోస్టు వద్ద యూటర్న్ ఏర్పాటుచేయాలి



తంగడంచ చెక్‌పోస్టు వద్ద హైవే అధికారులు యూటర్న్ ఏర్పాటుచేసి పారుమంచాల, తూడిచెర్ల, వాడాల, వేల్పనూరు, వెలుగోడు, కరిమద్దెల మీదుగా నంద్యాలకు ప్రయాణం సాగేలా చేయాలి. ప్రస్తుతం యూటర్న్ లేని కారణంగా నందికొట్కూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ద్విచక్రవాహనాలు, రైతుల ట్రాక్టర్లు వెళ్లలేని దుస్థితి నెలకొంది. అధికారులు వెంటనే తంగడంచ చెక్‌పోస్టు వద్ద యూటర్న్ నిర్మించకపోతే పనులను అడ్డుకుంటాం.

– పోచా జగదీశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, పారుమంచాల

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



పారుమంచాల చెక్‌పోస్టు వద్ద ఉన్న పారుమంచాల రోడ్డు మీదుగా జిల్లా కేంద్రమైన నంద్యాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా పారుమంచాల రోడ్డు వద్ద యూటర్న్ ఏర్పాటుచేయకపోతే పారుమంచాల మీదుగా నంద్యాల వరకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, రైతుల రాకపోకలకు కష్టమవుతుంది. ప్రజల విజ్ఞప్తి మేరకు విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– చంద్రశేఖర్‌నాయక్, తహసీల్దార్, జూపాడుబంగ్లా

ఇళ్లనిర్మాణాలను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి చింతామణి

కొత్తపల్లి: గిరిజన గూడేలలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి చింతామణి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గిరిజన గూడేలలో పీఎం జన్‌మన్ కార్యక్రమంలో రిజనులకు 170 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో 30 మంది గిరిజనులకు ఇళ్ల స్థలాలు లేవన్నారు. శివపురం 16, కొత్తపల్లి 11, గుమ్మడాపురం 1, ఎర్రమఠంలో ఇద్దరికి ఇళ్ల స్థలాలు లేకపోవడంతో వారికి స్థలాలు కేటాయించామన్నారు. శివపురం గూడెంలోని గిరిజనులకు స్థలం లేకపోవడంతో, అటవీశాఖ అధికారులతో మాట్లాడి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామన్నారు. ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ ఉమారాణి, గృహ నిర్మాణ శాఖ డీఈఈ నాగరాజు, ఏఈ పాండు నాయక్, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువు బస్తాల తూకం పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి

పాములపాడు: ఎరువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల్లో బిల్లు బుక్కులు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ప్రస్తుతం మండలంలో 88 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎరువుల బస్తాల తూకం వేసి పరిశీలించారు. ఆయన వెంట ఏఈఓ మద్దిలేటి ఉన్నారు.

● కొత్తపల్లి: రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మహేష్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మన గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అమ్మకాలు జరిపిన ప్రతి ఎరువు, రసాయనిక మందులకు రశీదు ఇవ్వాలని, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నకిలీ మందులు, ఎరువులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులు పక్కాగా ఉంచుకోవాలని సూచించారు.

● వెలుగోడు: స్థానిక ఎరువుల దుకాణాల్లో ఆత్మకూరు ఏడీ ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువులు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఏడీ హెచ్చరించారు. దుర్గ భవాని ఫర్టిలైజర్స్, శ్రీనివాస్ కెమికల్స్, మన గ్రోమోర్ సెంటర్, వెలుగోడు సొసైటీ, విమల ఫర్టిలైజర్స్ తదితర ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రిజిస్టర్లు స్టాక్ నిల్వలను పరిశీలించారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తప్పవు



అక్రమ వెంచర్లను జేసీబీ సహాయంతో తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

నందికొట్కూరు: అక్రమ వెంచర్లపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బేబి హెచ్చరించారు. శుక్రవారం పట్టణ సమీపంలో వెలిసిన అక్రమ వెంచర్లను మున్సిపల్ అధికారులు ధ్వంసం చేశారు. వెంచర్లలో వేసిన ప్లాట్ల రాళ్లను తొలగించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు వచ్చాక ప్లాట్లు వేయాలని ఆదేశించారు. ఇష్టానుసారంగా వెంచర్లు వేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. నంద్యాల రోడ్డు, నాగలూటి రోడ్డు వైపు 761, 852ఎ, 809 సర్వే నంబర్లలో మూడు వెంచర్ల సంబంధించిన 11 ఎకరాలు వేసిన వెంచర్లను జేసీబీ ద్వారా పోలీసుల సాయంతో రాళ్లను తొలగించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లాన్ ఆఫీసర్ రంరస్వామి, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ల్గొన్నారు.

ఠాకూర్ సేవలు మరువలేనివి



కర్పూరిఠాకూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

ఆత్మకూరు: బిహార్‌లో బీసీలకు రిజర్వేషన్ కల్పించిన గొప్ప మానవతావాది, మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్ సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ సంఘం జాతీయ గౌరవాధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి రఘురాముడుయాదవ్, ప్రధాన కార్యదర్శి బాలస్వామియాదవ్ అన్నారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం కర్పూరి ఠాకూర్ జయంతి వేడుకలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీసీ ఉద్యమాలు, బహుజన ఉద్యమాలను నడిపి రెండుసార్లు బిహార్ ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. బీసీలకు స్ఫూర్తి, మైనార్టీ సామాజికవర్గాలకు న్యాయం జరిగేందుకు సమాన హక్కుల కోసం పోరాడిన నాయకుడు కర్పూరి ఠాకూర్ అని, ఆయన సేవలను కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరన్న, తిమ్మయ్య, రవియాదవ్, వెంకటరమణయాదవ్, పెద్దనాగన్న, సుంకన్న, శివశంకర్ పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న ఆత్మకూరు పట్టణంలో చేపట్టే ట్రాక్టర్, బైకు ర్యాలీలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ కోరారు. శుక్రవారం ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. పంటలకు ఉచిత బీమాను ప్రకటించాలన్నారు. రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి అమలు చేయదలిచిన లేబర్ కోడ్‌లను నిలిపేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్‌లను నిర్వీర్యం చేసే నేషనల్ ఫ్రైమ్ వర్క్ పాలసీని వెనక్కి తీసుకోవాలని, వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలతోపాటు అవకాశం ఇచ్చే డిజిటల్ అగ్రిమిషన్ విధానం రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలపరిచి రోజు వేతనం రూ.600 కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాబాషా, వీరన్న, సీఐటీయూ నాయకులు సురేంద్ర పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీరై పారుతోంది!



ప్రధాన రహదారి పక్కనే పగిలిన పైపులైన్ (ఇన్‌సెట్)లో రహదారిపై పారుతున్న నీటిలో అవస్థలు పడుతున్న ప్రజలు

అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం ఈ చిత్రం. నందికొట్కూరు పట్టణంలోని నడిబొడ్డున చౌడేశ్వరిదేవి గుడి వద్ద వారం క్రితం పైపులైన్ పగిలి నీరు వృథాగా పారుతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల కళ్లకు కనిపించడం లేదు. తాగు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న తరుణంలో ఇలా రోజుల తరబడి నీరు వృథా అవుతుండటంతో స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు రోడ్డెక్కి పారుతుండటంతో ఆ ప్రాంతం కుంటను తలపిస్తోంది. మరోవైపు పాదచారులు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – నందికొట్కూరు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మిదుతూరులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మిదుతూరు: బాలికల పట్ల వివక్ష చూపకుండా వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ దశరథరామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కడుమూరు జెడ్పీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికలను కూడా బాగా చదివించుకోవాలన్నారు. లింగ అసమానత, బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనాథ్, డాక్టర్లు తిరుపతి, సాయిసుధ, ఎస్‌ఐ ఓబులేసు, ఈఓఆర్డీ సంజన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి పాల్గొన్నారు.

– కొత్తపల్లి: బాలికలను చదువులో రాణించేలా ప్రతి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. సమాజంలో ఆడపిల్లలపై రోజు రోజుకు అఘాయిత్యాలు చోటుచేసుకుంటుండటం బాధాకరమన్నారు. ఆడపిల్లలకు రక్షణ కల్పించడంతోపాటు బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల బాలికల చేత ర్యాలీ నిర్వహించారు.

– బండిఆత్మకూరు: మండల వ్యాప్తంగా శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాలు నిర్వహించారు. ×ఆడపిల్ల అంటే భారం కాదు–ఆడపిల్ల అంటే అదృష్టం నినాదంతో ర్యాలీలు నిర్వహించి, బాలల విద్య..భద్రత కోసం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అందరం సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

– జూపాడుబంగ్లా: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు సూపర్‌వైజర్ పావని, టీచర్ భారతి బహుమతులు అందజేశారు.

– మహానంది: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు నిర్వహించిన క్రీడా పోటీలు ఆసక్తిగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, తాడాటలో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏడుగురికి నోటీసులు జారీచేసిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: ఈనెల 19న ×సాక్షి₹ దినపత్రిలో ×దర్జాగా కబ్జా₹ శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ స్పందించారు. శుక్రవారం 117/బీ2 సర్వే నంబర్‌లో రెవెన్యూ అధికారుల నుంచి తలా ఐదు సెంట్ల చొప్పున పట్టాలు పొందిన మల్లెపోగు దేవమ్మ, మాదిత సరోజ, భాషపోగు సుశీలమ్మ, కాశపోగు జయమ్మతో పాటు 22ఏ సర్వేనెంబర్‌తో 117/బీ2 లోని స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్న మొల్లమ హబూబ్‌సాహెబ్, సి.రామాంజనేయులు, ఎం.శ్రీరామయ్యలకు నోటీసులు జారీచేశారు. ఒరిజినల్ ఇంటిపట్టాలు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్స్, ఈసీ, పట్టాపాసుపుస్తకాలు, కోర్టు తీర్పు ఉత్తర్వుల కాపీలతోపాటు ఏమైనా ఆధారాలుంటే ఈనెల 28న తహసీల్దార్ ఎదుట హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆత్మకూరు: పట్టణంలో శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. 132కేవీ లైన్ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పార్నపల్లిలో నేడు ఆధార్ శిబిరం

బండిఆత్మకూరు: పార్నపల్లిలో శనివారం ఆధార్ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి శుక్రవారం తెలిపారు. 6 ఏళ్లలో పు చిన్నారులకు ఆధార్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఉపాధి కూలీకి అస్వస్థత

చాగలమర్రి: మండలంలోని కదిరిపురం తండాకు చెందిన ఉపాధి కూలీ ఛత్రునాయక్ శుక్రవారం అస్వస్థతకు గురయ్యాడు. పని చేస్తుండగానే అస్వస్థతకు గురైనటుల ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ నాయక్ తెలిపారు. వెంటనే అతడిని చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనలతో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు రెఫర్ చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఏపీఓ నిర్మల ఆసుపత్రికి చేరుకుని పరామర్శించారు.

పరిసరాల పరిశుభ్రత

శ్రీశైలం: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ శ్రీశైలంలో భాగంగా శుక్రవారం సీఐ ప్రసాద్‌రావు తన సిబ్బందితో కలిసి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిశుభ్రత పనులు చేపట్టారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు: ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ రంగనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని చేసిన తీర్మానం మేరకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రజితమ్మ, పార్టీ పగిడ్యాల మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మహానంది, దినేష్, వినోద్, వీరేంద్ర ఉన్నారు.

నేషనల్ హైవేలో అండర్ పాస్ నిర్మించాలి

ఆత్మకూరు: మండంలోని ముష్టపల్లె, సిద్ధపల్లె, పెద్దనంతపురం, డైరీ కొట్టాల గ్రామాల వద్ద ఏర్పాటైన నేషనల్ హైవేలో అండర్ పాస్ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. పలువురు విద్యార్థులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల నుంచి దాదాపు 100 మంది విద్యార్థులం ఆత్మకూరులో వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్నామని, అందుకోసం సైకిళ్లపై, ఆటోలలోనూ, నడుచుకుంటూ రాకపోకలు సాగిస్తున్నామన్నారు. ఆత్మకూరుకు వెళ్లే దారిలో అడ్డంగా నేషనల్ హైవే ఉండడంతో ఆయా గ్రామాల రహదారిని మూసివేశారన్నారు. దీంతో పాఠశాలకు వెళ్లడానికి చుట్టూ తిరిగి వెళ్లడంతో సమయానికి చేరుకోలేకపోతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లి అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆత్మకూరు: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శులు ఎం.రజాక్, రామ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ఏజెన్సీలు నెలనెలా సక్రమంగా కనీస వేతనాలు అమలు చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు.

నిబంధనలు అతిక్రమించి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు



బ్రాహ్మణకొట్కూరులో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న రూరల్ సీఐ సుబ్రమ్మణ్యం, ఎస్ఐ, పోలీసులు

నందికొట్కూరు: నిబంధనలు అతిక్రమించి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ప్రయాణికులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. పోలీసు స్టేషన్ నుంచి రూరల్ సీఐ, ఎస్ఐ తిరుపాల్, పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాదారులు తప్పని సరిగా హెల్మెట్ వాడాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకుంటూ రాత్రి సమయంలో జాగ్రత్తగా బస్సులు నడుపుతూ ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మిడుతూరు: రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య, ఎస్ఐ ఓబులేసు సూచించారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని ఎస్ఐ ఓబులేసు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది హెల్మెట్లు ధరించి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సుబ్బయ్య, ఈఓఆర్డీ సంజన్న పాల్గొన్నారు.

● పాములపాడు: ద్విచక్రవాహన దారులు హెల్మెట్ తప్పక ధరించాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలైన వారే ఎక్కువగా మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి తెలుసుకోవాలన్నారు.

● బండిఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామంలో ఎస్ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఆయన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.